క్లుప్తంగా

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ఖలీల్‌వాడి: నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయం వద్ద సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈవీఎల్ నారాయణ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఐటీయూ ఆవిర్భావం నుంచి నేటి వరకు సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందని, అందుకు కార్మికవర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, ఫలితంగా రిజర్వేషన్ విధానాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టాన్ని సవరించటంలో ప్రభుత్వాలు విఫలం అయిందన్నారు. హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాయకులు శ్రీనివాసరాజ్, మధుసూదన్, బల్ల దుర్గయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో గల మానవతా సదన్ అనాథ పిల్లల కేంద్రంలో మనోజ అనే విద్యార్థినిని ఇటీవల 10వ తరగతిలో 9.5 జీపీఏ మార్కులు సాధించారు. ఈసందర్భంగా గురువారం శ్రీలక్ష్మీ చేయూత సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థినిని ప్రతిభ పురస్కారంతో సత్కరించారు. అధ్యక్షులు వంగల రమణాచారి, లక్ష్మన్, వేణుగోపాల్‌రావు, శ్యాంకుమార్, చంద్రశేఖర్, సురేష్ కుమార్, రామకృష్ణ ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ఎస్ (నేషనల్ మీన్స్–కమ్–మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు హెచ్ఎం కొండగోవర్ధన్ గురువారం తెలిపారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు నల్లవెల్లి రుత్విక, ఎర్రమొల్ల నిహారికలు ఎన్ఎంఎంఎస్ కింద రాబోయే 4 సంవత్సరాలలో రూ. 48వేల ఉపకారవేతనం పొందుతారన్నారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



మోపాల్: మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి శ్రీ లక్ష్మీ చేయూత సేవా సమితి ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.6వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. సమితి అధ్యక్షుడు వంగల రమణాచారి, ప్రతినిధులు లక్ష్మణ్, వేణుగోపాల్ రావు, శ్యాం కుమార్, చంద్రశేఖర్, సురేష్ చారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత



ఖలీల్ వాడి: అనారోగ్యంతో ఐదవ టౌన్ పోలీస్ కానిస్టేబుల్ రామాంజనేయరెడ్డి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబానికి చెక్కును సీపీ కల్మేశ్వర్ అందించారు. గురువారం రూ.8 లక్షల చెక్కును కానిస్టేబుల్ భార్య రోజాకు అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కోటేశ్వరరావు, ఏవో శ్రీనివాస్ రావు, ఆఫీస్ సూపరింటెండెంట్లు, డీపీవో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'ఎరువుల కొరత లేదు'



ధర్పల్లి: జిల్లాలో ఎరువుల కొరతలేదని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) వాజిద్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని రామడుగు, హొన్నాజీపేట్, ధర్పల్లి సొసైటీలతో పాటు ఎరువుల, విత్తనాల దుకాణాల్లో ఎరువుల నిల్వలు, రికార్డులను ఆయన గురువారం పరిశీలించారు. పీవోఎస్ ద్వారా రైతులకు ఎరువులు విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని, అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేయొద్దని సూచించారు. కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో ఎరువులను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆయనవెంట ఏవో వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరం.. బైపాస్ ప్రయాణం

రోడ్డుపై గుంతలు
- కానరాని విద్యుత్ దీపాలు
- రాత్రివేళ వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు పక్కన ఏర్పడిన గొయ్యి

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు గుండా ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై అక్కడక్కడు గుంతలు ఏర్పడటంతోపాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రోడ్డుపై విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఈ బైపాస్ గుండా కొన్ని వందలాది వాహనాలు ప్రయాణం చేస్తాయి. అయినా అధికారులు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో ఏర్పడ్డ పెద్ద గోయ్యి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఆదమరిచి వాహనం నడిపితే ఆ గోతిలో పడి, ప్రమాదం జరిగే అవకాశం ఉంది. బైపాస్ రోడ్డుపై సెంటర్ లైటింగ్ లేదు. అంతే కాకుండా ఆర్‌వోబీ పనులు వద్ద నిర్మించిన కల్వర్టు వద్ద కూడా ఎలాంటి ప్రమాద సూచికలు లేవు. రాత్రి వేళ వాహనదారులు కల్వర్టును గమనించక ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అయినా అధికారులు అక్కడ విద్యుత్ దీపాలు, ప్రమాద సూచికలు ఏర్పాటుచేయకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల రోడ్డుపై గుంతలు ఏర్పడగా..



రానున్న వర్షాకాలంలో వర్షాలకు తారు లేచిపోయి మరిన్ని గుంతలు ఏర్పడే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంఠేశ్వర్ బైపాస్ రోడ్, ఆర్‌వోబీ వద్ద నిర్మించిన వంతెన వద్ద విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని, రోడ్డుపై గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.



రహదారిపై ఏర్పడ్డ గుంతలు

మరమ్మతులు చేపట్టాలి..

నగర శివారులోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డుపై నిత్యం కొన్ని వందలాది వాహనాలు ప్రయాణిస్తు ఉంటాయి. ఈ నేపథ్యంలో అధికారులు గుంతమయంగా ఉన్న రోడ్డును బాగుచేయాలి. లేదంటే వచ్చే వర్షాకాలంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. –విజయ్, నగర వాసి

నేటి చిత్రం..



నగరంలోని ఓ హోటల్ ఎదుట ఏర్పాటు చేసిన సిలిండర్లు

పొంచి ఉన్న ప్రమాదం

నగరంలో ఫైర్‌స్టేషన్ పక్కనే గల ఓ హోటల్ ముందు పెద్ద ఎత్తున కమర్షియల్ సిలిండర్లను ఎండలో నిల్వ ఉంచి, హోటల్ కిచెన్‌లోకి కనెక్షన్లు ఇచ్చారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నందున ఎండవేడిలో సిలిండర్లు ఉంచడంతో ఏదైన అనుకోనిది జరిగితే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. గ్యాస్ లీకేజీలు జరిగే అవకాశం కూడా ఉంది. అయినా సమీపంలోనే సంబంధిత అధికారులు ఉన్నా.. పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిలిండర్ల ఏర్పాటులో కనీస జాగ్రత్తలు పాటించాలని పలువురు సూచిస్తున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఏజెన్సీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సుభాష్‌నగర్: జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల్లో పని చేస్తున్న కార్మికులకు ఆయిల్ కంపెనీల నిబంధనల ప్రకారం డెలివరీ ఛార్జీలు చెల్లించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి వై ఓమయ్య డిమాండ్‌చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా నాలుగో రోజు గురువారం వారు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఎస్‌వో చంద్రప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఓమయ్య మాట్లాడుతూ.. ఏజెన్సీల యాజమాన్యాలు డెలివరీ చార్జీలు ఇవ్వకుండా గ్యాస్ వినియోగదారుల వద్ద వసూలు చేయిస్తున్నాయని ఆరోపించారు. ఒక సిలిండర్ డెలివరీ చేస్తే రూ.33.43 చార్జి కార్మికులకు యాజమాన్యాలు చెల్లించాలని, కానీ అలా చెల్లించకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయన్నారు.

కార్మికులకు డెలివరీ చేసే వాహనాలు వారే సమకూర్చాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే విధుల్లో నుంచి తొలగిస్తున్నారని, ఈవిషయమై ఫిబ్రవరి నుంచి కార్మికశాఖ అధికారుల ద్వారా విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు కలెక్టర్ హామీనిచ్చినట్లు ఓమయ్య తెలిపారు. నాయకులు హన్మాండ్లు, సాయన్న, రవికుమార్, బబ్లూ, రాజు, నయీమ్, గంగాధర్, కార్మికులు పాల్గొన్నారు.

విత్తనాలు కొంటే రశీదు తీసుకోవాలి





ఖానాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ప్రదీప్.. చిన్నవాల్గోట్‌లో మాట్లాడుతున్న సతీష్

నిజామాబాద్ రూరల్: రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటపుడు దుకాణ యజమాని నుంచి కచ్చితంగా రశీదును తీసుకోవాలని రూరల్ ఏడీఏ ప్రదీప్ పేర్కొన్నారు. మండలంలోని ఖానాపూర్ గ్రామంలో గురువారం ఆయన రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. జూన్ మాసం ప్రారంభం అవుతున్న వేళ రైతన్నలు విత్తనాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొంది, లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమేవిత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొన్నప్పుడు తీసుకున్న రశీదును పంట పూర్తయ్యేంత వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏఈవో జ్ఞానేశ్వర్, కోర్వ రాజేంద్ర ప్రసాద్, నరేందర్, అబ్బన్న, కోర్వ గంగాధర్, సాయి కుమార్, గంగమల్లు ఉషన్నా, ప్రతాప్, రవి, రాజు, భాస్కర్, రమేష్, ఇమామ్, రైతులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని చిన్నవాల్గోట్, సర్పల్లి తండా, గోప్యతండా, తాటిపల్లి గ్రామాల్లో గురువారం రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ.. విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు వివరించారు. నాసిరకం విత్తనాల నిర్మూలన, విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఈవోలు సతీష్, శ్రీకాంత్, శివాని, నిఖిల్, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

రేపు శ్రీలక్ష్మి, కుబేర ఆలయ వార్షికోత్సవం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నాగారంలో గల శ్రీలక్ష్మి, కుబేర ఆలయ పంచమ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకురాలు మాతా అనంతలక్ష్మి, ఆలయ అధ్యక్షురాలు గుజ్జరాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు దేవతామూర్తులకు పంచామృత అభిషేకాలు, 11గంటలకు లక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. వేడుకల్లో నగరప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

దత్తసాయి ఆలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: మండలంలోని చేపూర్ శివారులో ఉన్న దత్త సాయి ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు ప్రశాంత్, భూమన్న, పేట్ల సంజీవ్, ఎర్మా భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెన

- గోప్యతండా వద్ద కొన్నేళ్ల క్రితం రాళ్లతో నిర్మాణం
- దెబ్బతిన్న వంతెన అడుగుభాగం
- పట్టించుకోని అధికారులు



వంతెన అడుగు భాగంలో ఊడిపోతున్న రాళ్లు



గోప్యతండా వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన

సిరికొండ(నిజామాబాద్ రూరల్): మండలంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన రాతి వంతెన ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిరికొండ నుంచి కామారెడ్డికి వెళ్లే మార్గంలో గోప్య తండా వద్ద కొండాపూర్ ఊర చెరువు అలుగు వాగుపై సుమారు 35ఏళ్ల కిందట బండ రాళ్లతో వంతెనను నిర్మించారు. దీంతో వాగు ప్రవాహనికి వంతెన అడుగుభాగం దెబ్బతింటోంది. వర్షాలు, వరద ఉధృతికి ప్రతి ఏటా వంతెన అడుగు భాగం కోతకు గురవుతూ రాళ్లు పడిపోతున్నాయి. అలాగే వంతెనపై భాగంలో కూడా స్లాబ్ ధ్వంసమైంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

డబుల్ రోడ్డు.. సింగిల్ బ్రిడ్జి..

సిరికొండ మండలంతో పాటు మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీంగల్ మండలాలకు చెందిన ప్రజలు హైదరాబాద్ వెళ్లడానికి ఈ మార్గాన్నే వినియోగిస్తారు. ఈ రోడ్డును ఇటీవల డబుల్ రోడ్డుగా మార్చడంతో నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా మారింది. రోడ్డు డబుల్‌గా ఉండి వంతెన సింగిల్ కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వంతెనకు ఇరు పక్కల రెయిలింగ్ కూడా దెబ్బతింది. రెయిలింగ్ లేకపోవడంతో రాత్రివేళ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం..



కామారెడ్డికి వెళ్లే రోడ్డులో కొండాపూర్ వాగుపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వంతెనపై స్లాబ్ ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. రెయిలింగ్ విరిగిపోయింది. దీంతో వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వంతెన శిథిలావస్థకు చేరడంతో అవస్థలు పడుతున్నాం. –కిరణ్, గడ్కోల్

నూతన వంతెన నిర్మించాలి



వంతెనను చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. వంతెన అడుగు భాగంలో రాళ్లు ఊడిపోతున్నాయి. ఎప్పుడు కూలిపోతుందో అన్నట్లు తయారైంది వంతెన పరిస్థితి. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా చేయడంతో రద్దీ ఎక్కువైంది. ప్రభుత్వం స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి. – రహీం, కొండాపూర్

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య



గడ్కోల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

ధర్పల్లి: ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని అధ్యాపకులు పేర్కొన్నారు. ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గురువారం గడ్కోల్, హొన్నాజీపేట్, వాడి గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ కళాశాలలో వసతులను వివరించారు. ప్రవేశాలకు పలువురు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిబ్బంది మహేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,200	వెండి (కిలో)	93,500
22 క్యారెట్స్	67,525	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సడ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	26	50	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	50	80
జీరకాయ	40	70	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	25	40
బీర్నీసుకాయ	100	120	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	15	30	బీట్‌రూట్	20	40
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	100	130	గోరుచిక్కుడు	70	100
పుదీనా	60	80	చిక్కుడుకాయ	80	100
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	గంగా ఆఫ్ గోదావరి (తెలుగు) – 10.35, 1.30, 4.25, 7.20, 10.30
స్క్రీన్-3	గంగం గణేశా (తెలుగు) – 10.45, 1.45, 7.45, భజే వాయు వేగం (తెలుగు) – 4.45, 10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	గం గం గణేశా (తెలుగు) – 10.00, 4.00, 7.05, 10.10, భజే వాయు వేగం (తెలుగు) – 1.05
స్క్రీన్-2	గంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) – 10.10, 1.15, 4.20, 7.25, 10.30
స్క్రీన్-3	సవి (హిందీ) – 10.50, 7.55, ఫ్యూరియోసా (తెలుగు) – 1.35, భజే వాయువేగం (తెలుగు) – 10.40
స్క్రీన్-4	భజే వాయువేగం (తెలుగు) – 10.55, 7.35, హిట్‌లిస్ట్ (తెలుగు) – 1.50, లవ్‌మీ (తెలుగు) – 4.40, 10.30
దేవి	గంగ్స్ ఆఫ్ గోదావరి
నటరాజ్	హిట్‌లిస్ట్ (తెలుగు)
విజయ్	లవ్‌మీ (తెలుగు)

సమాచారం..

9న పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ జిల్లా పద్మశాలి మహిళా సంఘం, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి ఆధ్వర్యంలో జూన్ 9న నగరంలో పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు పరిచయ వేదిక చైర్మన్ గుజ్జ రాజేశ్వరి, జిల్లా పద్మశాలి మహిళ సంఘం అధ్యక్షురాలు గుడ్ల చంద్రబాగ, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి అధ్యక్షులు రాపెల్లి గురుచరణం, కన్వీనర్ బింగి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ అంబేద్కర్ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని పద్మశాలీలు వధూవరులు ఈ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని వారు కోరారు. వివరాలకు గుజ్జ రాజేశ్వరి– 93466 45161, రాపెల్లి గురుచరణం– 98665 57115, గుజ్జేటి వెంకటనర్సయ్య– 99855 66374, గుడ్ల చంద్రబాగ–98482 29322ను సంప్రదించాలన్నారు.

నేడు మోపాల్ సొసైటీ వైస్ చైర్మన్ ఎన్నిక

మోపాల్: మోపాల్ ప్రాథమిక సహకార సంఘం వైస్ చైర్మన్ ఎన్నిక శుక్రవారం నిర్వహించనున్నారు. ఎన్నికల అధికారిగా పోశన్న వ్యవహరించనున్నారు. ఉదయం 9 గంటలకు వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. రెండు నామినేషన్లు వస్తే సీక్రెట్ ఓటింగ్ ద్వారా వైస్ చైర్మన్‌ను డైరెక్టర్లు ఎన్నుకుంటారు. కాగా వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశముంది. గతంలో వైస్ చైర్మన్ సిర్‌పూర్‌కు చెందిన సింగిడి చిన్నారెడ్డి రెండు నెలల క్రితం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా అదే గ్రామానికి చెందిన డైరెక్టర్‌ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారనే ప్రచారం ఉంది.

రోడ్డును బాగు చేయండి



మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) చెరువు కట్టకు వెళ్లే దారిలో వర్షాలకు రోడ్డుపై మట్టి కొట్టుకుపోయింది. మట్టి కింద ఉన్న పైపుల మీద నుంచే రైతులు అవస్థలు పడుతూ అటువైపు ఉన్న పంట పొలాలకు వెళ్తున్నారు. బైక్‌లు, ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురవక ముందే రోడ్డుపై మట్టిని పోయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి, రోడ్డును పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.